క్లుప్తంగా

జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలు



పోటీలో తలపడుతున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌లో గురువారం నిర్వహించారు. కరాటే ఎంపిక పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని అండర్ 14, 17, 19 విభాగంలో 26 మంది బాలబాలికలు పాల్గొన్నారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బి.వెంకట్, దేవయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆసుపత్రి తనిఖీ



ఆసుపత్రి ఎదుట ఏఎస్‌సీఐ బృందం

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలి వెల్ఫేర్ ఆదేశాల మేరకు ఏఎస్‌సీఐ బృందం సభ్యులు గురువారం ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలోని సౌకర్యాలు, వైద్య పరికరాలు, తదితర వాటిని పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాల నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించనున్నట్లు పేర్కొన్నారు. వీరి వెంట వైద్యులు సందీప్, ఆషిష్ కుమార్, రవితేజ, చంద్రశేఖర్, ఏఎస్‌సీఐ సభ్యులు ఉన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్(టి) మండలంలోని పారిగాం గ్రామంలోని రేషన్‌డీలర్ దుకాణంలో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీనివాస్, రాజ్‌కుమార్, జీపీవో జ్యోతేశ్వర్‌లు తణిఖీలు చేపట్టారు. తనిఖీల్లో రికార్డులతో స్టాక్ వివరాలను పరిశీలించారు. 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం లేకపోవడంతో రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వేంపల్లి వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం సిర్పూర్(టి) మండలంలోని వేంపల్లిలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ నవత గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. డెంగ్యూ, మలేరియా, బీపీ, షుగర్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దత్తు, అధ్యాపకులు దుర్గం మహేశ్, సంతోష్, లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ జిల్లా అభివృద్ధి అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఎం.శివకుమార్‌ను జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బీసీ వసతిగృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది గురువారం సన్మానించారు. అధికారులు భోగ మధుకర్, ప్రసాద్, కృష్ణప్రసాద్, తిరుపతి, భాగ్యరాణి, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్ అన్నారు. రెబ్బెన మండలం కొండపల్లి, ముద్దిగుంట గ్రామాలకు చెందిన సుమారు 150 మందికి గురువారం పార్టీ కండువా కప్పారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోట్‌బుక్‌ల పంపిణీ

సిరికొండ: మండలంలోని పాలవాగు గ్రామంలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మండల ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెన్నులు, నోట్‌బుక్‌లు గురువారం పంపిణీ చేశారు. పెందూర్ మహేందర్, నాగోరావు, మెస్రం నగేశ్ పాల్గొన్నారు.

ఠాణాలో ‘గ్రంథాలయం’



మండల కేంద్రంలో నిరుపయోగంగా పోలీస్‌స్టేషన్ పాత భవనం

- రెబ్బెన పోలీస్‌స్టేషన్ పాత భవనంలో ఏర్పాటుకు సన్నాహాలు
- చర్యలు చేపడుతున్న పోలీసులు
- త్వరలో భవనానికి రంగులు

రెబ్బెన: గ్రంథాలయం జ్ఞాన సముపార్జనకు కేంద్రం. పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయి. పేద విద్యార్థులు, నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకుని రెబ్బెన పోలీస్‌శాఖ గ్రంథాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టబోతుంది. రెబ్బెనలోని పాత పోలీస్‌స్టేషన్ భవనంలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ఎంపీడీవో కార్యాలయ సమీపంలో నూతన పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించగా, దాదాపు మూడేళ్ల క్రితం అందులో మార్చారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న పోలీస్‌స్టేషన్ పాత భవనం నిరుపయోగంగా మారింది. ముందుభాగంలో పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉంది. అయితే, తిర్యాణి మండల కేంద్రంలో ఇదే తరహా మాదిరిగా రెబ్బెనలో పోలీస్‌స్టేషన్ పాత భవనాన్ని గ్రంథాలయంగా మార్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. సీఐ సంజయ్, ఎస్సై వెంకట్ కృష్ణ ఇటీవల పాత భవనం వద్ద పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. ఏఎస్పీ చిత్తరంజన్..స్టేషన్ భవనాన్ని పరిశీలించి గ్రంథాలయ ఏర్పాటుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. త్వరలో భవనానికి రంగులు వేసి గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

గ్రంథాలయం ఉన్నా సౌకర్యాలు సున్న..

రెబ్బెనలో శాఖ గ్రంథాలయం అందుబాటులో ఉంది. సుమారు 470 మంది డిపాజిట్‌దారులు ఉండగా 4,650 పుస్తకాలు ఉన్నాయి. ప్రతీరోజు 50 మంది పాఠకులు ఇక్కడకు వస్తుంటారు. అయితే గ్రంథాలయానికి పక్కా భవనం లేక రెండు దశాబ్దాలుగా అరకొర సౌకర్యాల మధ్య కమ్యూనిటీ భవనంలో కొనసాగుతోంది. ఇది శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలం పైకప్పు ఊరుస్తుండటంతో పుస్తకాలు తడుస్తున్నాయి. కేవలం మూడు గదులు ఉండగా ఒక గదిని పాఠకుల కోసం, మరో గదిని స్టోర్ రూమ్‌కు కేటాయించారు. ఇరుకిరుగా గాలి, వెలుతురు సరిగా లేని భవనంలో పాఠకులు శ్రద్ధగా పుస్తక పఠనం చేయలేకపోతున్నారు.

స్టేషన్ భవనంలో వసతులు

రెబ్బెన పోలీస్‌స్టేషన్ పాత భవనంలో గ్రంథాలయం ఏర్పాటైతే పాఠకులకు కావాల్సిన అన్ని వసతులు అందుబాటులో ఉండనున్నాయి. రెండు విశాలమైన గదులు, మరో మూడు చిన్న గదులతోపాటు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఉంది. పుస్తకాలు భద్రపర్చేందుకు స్టోర్‌రూంలు ఉన్నాయి. ప్రధాన రోడ్డుపైనే ఉండటంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య పెరుగుతుంది. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లను విడుదల చేస్తుండటంతో గ్రంథాలయం ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది.

త్వరలో ప్రారంభిస్తాం



పోలీస్ స్టేషన్ పాత భవనాన్ని గ్రంథాలయంగా మార్చాలని నిర్ణయించాం. ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ దృష్టికి తీసుకెళ్లాం. ఇందుకు వారు అంగీకరించి ప్రత్యేక చొరవ చూపారు. స్టేషన్ ఆవరణలో మొక్కలను తొలగించి శుభ్రం చేయించాం. భవనానికి రంగులు వేయించి త్వరలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తాం.

– వెంకట్ కృష్ణ, ఎస్సై, రెబ్బెన

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం



చెత్త కుప్పల్లో పడేసిన పాలిథిన్ కవర్లు

- కిరాణ దుకాణాల్లో దర్శనం
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎక్కడ చూసినా ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగం కనిపిస్తోంది. కిరాణ దుకాణాల్లో వీటి విక్రయాలు బహిరంగంగానే సాగుతున్నాయి. ప్రధానంగా హోటళ్లు, చికెన్ సెంటర్లు, చిన్నచిన్న దుకాణాలతో పాటు సంతల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకం పరిపాటిగా మారింది. వినియోగించిన అనంతరం ఎక్కడ పడితే అక్కడ పరేయడంతో అవి భూమిలో కలవకుండా పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

అమలు కాని నిబంధనలు..

సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 40 మైక్రాన్ల మందం కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. దీనికి విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగించే వారిపై కేసులు నమోదు చేయాలనే నిబంధన ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయంగా పేపర్‌తో గ్లాసులు, కవర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి భూమిలో కలిసిపోయినా.. ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిసినా.. వాటిని ఎవరూ వినియోగించడం లేదు. వీటి ధర ఎక్కువగా ఉందని, తక్కువకు వచ్చే పాలిథిన్ వైపే వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు.

ప్రకటనలకే పరిమితం..

ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశాం, వాటిని విక్రయిస్తే జరిమానా విధిస్తామని అధికారులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ప్లాస్టిక్ విక్రయించే వారిపై అధికారులు తీసుకున్న చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వ ఆదేశాలతో వంద రోజుల కార్యక్రమాన్ని నిర్వహించి తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణల వినిపిస్తున్నాయి. నిత్యం ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుంది. పట్టణం, గ్రామంలో ఏ వీధి, ఏ కాలనీలోని చెత్త కుప్పల్లో చూసినా.. ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తనిఖీలు చేపడుతాం

ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పట్టణంలోని వ్యాపార సముదాయాల్లో ప్లాస్టిక్ అమ్మకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్‌తో అనేక అనార్థాలున్నాయి. వాటిని ఎవరూ వినియోగించవద్దు.

– రాజేందర్, మున్సిపల్ కమిషనర్

నామినేషన్ల కేంద్రాలు పారంభం



దహెగాంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కౌంటర్



పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

దహెగాం: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ గురువారం వెలువడిన నేపథ్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. మొదటి రోజు నామినేషన్‌లు ఎవరూ వేయలేదు. మండలంలో జెడ్పీటీసీ, 8 ఎంపీటీసీ స్థానాలకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి నస్రుల్లా ఖాన్ తెలిపారు. నామినేషన్‌ల ప్రక్రియను కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ పరిశీలించారు.

నామినేషన్ కేంద్రం పరిశీలన

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి రైతువేదికలోని స్థానిక సంస్థల నామినేషన్ కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా గురువారం పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారులతో మాట్లాడి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ వహీఉద్దీన్ ఉన్నారు.

మొదటి రోజు రెండు దాఖలు..

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్(టి) మండల ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో భాగంగా మొదటి రోజు గురువారం మండలంలోని డోర్‌పల్లి ఎంపీటీసీ స్థానానికి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. జాడే కోటేశ్వర్, జాడే గౌతమ్‌లు ఇద్దరు ఎంపీటీసీ స్థానానికి నామినేషన్‌లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

కెరమెరి: ఎన్నికల బాధ్యతను ప్రతి పోలింగ్ అధికారి నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. మండలంలోని కెస్లాగూడ రైతువేదికలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ అధికారులకు గురువారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన హాజరై మాట్లాడారు. పోలింగ్ అధికారులు ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల మాస్టర్ ట్రైనర్ శాంతికుమార్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ సంతోష్‌కుమార్, ఎంఈవో ఆడే ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై శిక్షణ

లింగాపూర్: మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం పోలింగ్ ఆధికారులు, సిబ్బందికి స్థానిక సంస్థల ఎన్నికలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో రామచందర్, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో రజనీకాంత్, ఉపాధ్యాయులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం వైపు యువత మొగ్గు



మాట్లాడుతున్న అరిగెల నాగేశ్వరరావు

కెరమెరి: సనాతన ధర్మం వైపు యువత మొగ్గుచూపుతుందని వన్ నేషన్, వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని అనార్‌పల్లి, దేవాపూర్ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ప్రజలు సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కెరమెరి జెడ్పీటీసీగా బరిలో ఉంటున్నట్లు ప్రకటించారు. విజయం సాధిస్తే ఆసిఫాబాద్ మాదిరిగా కెరమెరిని అభివృద్ధి చేస్తానని తెలిపారు. లక్మాపూర్, అనార్‌పల్లి వాగులపై వంతెన నిర్మాణాలు పూర్తి చేస్తానన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, వెంకటి, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం వర్ధంతిని అంబేద్కర్ సంఘం, బీఎస్ఐ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఎస్ఎస్‌డీ జిల్లా అధ్యక్షుడు దుర్గం సందీప్, నాయకులు దుర్గం దుర్గాజీ, రోషన్, శ్యాంరావు, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో బోగస్ హాజరుకు చెక్!

- జాబ్‌కార్డుతోపాటు ఆధార్ అనుసంధానం
- పనిప్రదేశంలో కూలీలకు ఐరిస్ నమోదు
- ఈకేవైసీ పూర్తికి ఆదేశాలు



సావర్‌ఖెడా సమీపంలో ఉపాధి పనులు



పరంధోళిలో ఈకేవైసీ చేస్తున్న ఎఫ్ఏ

కెరమెరి: ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీల బోగస్ హాజరుకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జాతీయ మస్టర్ పర్యవేక్షణ వ్యవస్థ(ఎన్ఎంఎంఎస్) యాప్‌లో కూలీల వివరాలు ఈకేవైసీ నమోదు చేయడం తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా ఉపాధి అధికారులు కూలీల జాబ్ కార్డులకు ఆధార్‌ను అనుసంధానం చేయడం, వారి కనుపాపలు (ఐరిస్) నమోదుతో ఒకరికి బదులుగా మరొకరు పనికి వచ్చే అవకాశం ఉండదు. మృతుల పేర్లు నమోదు చేసే వీలుండదు. దీంతో అధిక మంది కూలీలు పనికి వచ్చినట్లు ఇష్టారాజ్యాంగా మస్టర్లు రాయలేరు. మండలంలోని అన్ని పంచాయతీలో ఈకేవైసీ పనులు కొనసాగుతున్నాయి.

మండలంలో..

మండలంలోని 31 పంచాయతీలు, మొత్తం జాబ్ కార్డులు 10, 285 ఉండగా, ఆక్టివ్ జాబ్ కార్డులు 8301 ఉన్నాయి. 18785 కూలీలు ఉండగా, 14454 మంది ఆక్టివ్ కూలీలు ఉన్నారు. అందులో ఇప్పటివరకు ఐకేవైసీ 5225 మందికి అయింది.

సాంకేతిక ఇబ్బందులు

ఈకేవైసీ ప్రారంభమై పది రోజులు గడుస్తున్నప్పటికి గురువారం వరకు మండలంలో కేవలం 43 శాతమే నమోదైంది. అనేక గ్రామాలు సుదూర ప్రాంతాలుగా ఉండడం, సిగ్నల్స్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కాగా కొన్నిరోజుల క్రితం వరకు యాప్ సైతం మొరాయించడంతో ప్రక్రియ వేగవంతం కాలేదు.

వారంలో పూర్తి చేయాలి



మండలంలో ఉపాధి హామీ కూలీల ఈకేవైసీ ప్రక్రియ వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించాం. క్షేత్రస్థాయిలో టీఏలు, ఎఫ్ఏల ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. పని అడిగిన వారందరికి ఉపాధి పని కల్పిస్తాం. నకిలీ మస్టర్లకు తావు లేకుండా అర్హులైన కూలీలకు వంద రోజులు పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, కెరమెరి

‘బీసీలు రాజకీయంగా ఎదగకుండా కుట్ర’



మాట్లాడుతున్న రమేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీల రిజర్వేషన్ కోసం ప్రభుత్వం తెచ్చిన జీవో 9ని సవాల్ చేస్తూ కుట్రపూరితంగా హైకోర్టును ఆశ్రయించిన రెడ్డి జాగృతి సభ్యులారా ఖబడ్దార్ అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డూప్‌నార్ రమేశ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు రాజకీయంగా ఎదగకుండా ఉండేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా మీరు కేసు వాపసు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. రెడ్డి జాగృతి కుట్రలు, కుతంత్రాలు పన్నిన ఎప్పటికైనా బీసీ రాజ్యాధికారాన్ని సాధించి తీరుతామన్నారు. నేడు బీసీ సంఘాలతో కలిసి జిల్లా కేంద్రంలో ఆందోళనలు చేపడుతామన్నారు. బీసీలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు మారుతి, తిరుపతి, కమలాకర్, హనుమంతు, సదాశివ్, శ్యాంరావ్, తదితరులు పాల్గొన్నారు.

‘స్థానికేతరులకు చోటు లేదు’



మాట్లాడుతున్న కుసుంబ్‌రావు

కెరమెరి: స్థానికేతరులకు కాంగ్రెస్‌లో చోటు లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్థానికంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు ఉన్న పార్టీలోని ప్రముఖ నేత ఇతర ప్రాంతానికి చెందిన అభ్యర్థిని తీసుకువచ్చి పోటీచేయించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి అందరు కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అధిష్టానం ఎవరి పేరు ఖరారు చేస్తే వారికి మద్దతు ఇచ్చి గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, నాయకులు శేషరావు, బాబు, తుల్సిరాం, జలపతిరావు, న్యానేశ్వర్, తిరుపతి, మోతిరాం, శ్రీదర్, బాపూరావు, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి

నేరడిగొండ: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) స్వర్ణలత అన్నారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఒకసారి పంట నాటిన తర్వాత నాలుగో సంవత్సరం నుంచి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. మొదటి మూడు సంవత్సరాలు అంతర పంటలు సాగు చేయవచ్చన్నారు. ప్రభుత్వం 90 శాతం మొక్కలు, డ్రిప్ నీటి వసతి కోసం 90 శాతం నుంచి వంద శాతం సబ్సిడీపై ఆయిల్‌పామ్ సాగు కోసం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రియూనిక్ ఆయిల్‌పామ్ కంపెనీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

లింగాపూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏస్సై గంగన్న పేర్కొన్నారు. మండలం కేంద్రంలో గురువారం అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు తమ వాహనపత్రాలు తమ వెంట తెచ్చుకోవాలన్నారు.

గుంతలు పూడ్చివేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్, బాబాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లపై గుంతలను పూడ్చాలని గ్రామస్తులు గురువారం నిరసన తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకుని గుంతలు పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంకసాపూర్ గ్రామస్తులు కేశవరావు, రాము, శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.